www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 164 హైదరాబాద్ సోమవారం 01-09-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కాళేశ్వరంపై రగడ: అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

**కాళేశ్వరం నివేదికపై చర్చలో తీవ్ర గందరగోళం**
**జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసిన బీఆర్ఎస్**
**మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ సభ నుంచి వాకౌట్**
**బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్**
**నివేదిక ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ**

హైదరాబాద్ ఆగస్టు 31 (సిద్దిపేట పవర్):

తెలంగాణ శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన చర్చ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

కాళేశ్వరం నివేదికపై చర్చ జరుగుతున్న సమయంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో గంటన్నర పాటు వేచి చూశామని, అయినా అవకాశం రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొందరు సభ్యులు ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. సభ లాబీల్లో భారీ సంఖ్యలో మార్షల్‌స్‌ను మోహరించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనంతరం ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారు తమ నిరసనను కొనసాగించారు.

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభలో కాగితాలు చించివేయడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. కాళేశ్వరం నివేదికలోని వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఇలా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభా నియమాలను గౌరవించాలని ఆయన సూచించారు.

# పీసీ ఘోష్ మా హక్కులను కాల రాశారు : హరీశ్‌రావు

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :

జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిటీ తమ హక్కులను కాలరాసిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం రిపోర్ట్‌పై విచారణ సందర్భంగా ఆయన హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పీసీ ఘోష్ ఎఫెక్ట్ పీపుల్ అయిన మా హక్కులను కాలరాశారు. మాకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదు. మాపై చేయబోతున్న ఆరోపణల గురించి ఆ వివరాలు చెప్పి.. దానిపై మా వివరణ తీసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. దాన్ని ఆయన అనుసరించలేదు. నాకుగానీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గానీ, ఇంకా పిలిచిన నేతలు, అధికారులకు కూడా నాకు తెలిసిన వరకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదు. క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం ఇవ్వలేదు. ఈ విచారణ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది సుస్పష్టం. ఇవాళ కాంగ్రెస్ పార్టీ అసలు మేడిగడ్డ వద్ద లోపం ఏర్పడక ముందే కాళేశ్వరంపై దుష్ప్రచారాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రారంభించారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా మేం సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ముందే మేనిఫెస్టోలో పెట్టింది. కాంగ్రెస్ ముందు నుంచి కూడా ఈ ప్రాజెక్టు కడితే కేసీఆర్, బీఆర్ఎస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నరు. భూ సేకరణను అడ్డుకున్నారు. అనేక ఆరోపణలు చేస్తూ వచ్చారు. దాంట్లో భాగంగానే ఈ ఘోష్ కమిషన్ వేసి రాజకీయమైన కక్ష సాధింపునకు ఈ ప్రభుత్వం దిగుతుంది. నేను చెప్పేది ఒకటే విషయం. ఆ వాస్తవాలు చట్టానికి లోబడి ఉండాలి. ఘోష్ కమిషన్ రిపోర్ట్‌లో ఎక్కడా లేదు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుంది' అన్నారు.



**రాజకీయ అస్త్రంగా వాడుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పింది..**

'8బీ ప్రకారం నోటీసులు ఇవ్వకుండా గతంలో విచారణ కమిషన్ల నివేదికలు ఏమయ్యాయో ఒకసారి అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. 1958లో సుప్రీం కోర్టు రాంకృష్ణ దాల్మియా వర్సెస్ జస్టిస్ టెండూల్కర్ కేసులో విచారణ కమిషన్‌ను రాజకీయ అస్త్రం వాడుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పింది. కాళేశ్వరంపై మొదటి నుంచి చెబుతూ వస్తున్న గోబెల్స్ చరిత్రను చూస్తే ఈ కమిషన్ రిపోర్టును పొలిటికల్ వెపన్‌గా వాడుతున్నారని సుస్పష్టంగా అర్థమవుతున్నది. ఇదే కేసులో సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే.. విచారణ కమిషన్ అయినా విచారణ సందర్భంలో 1952 చట్టాన్ని మీరకూడదు. చట్టం పరిధిలో నిస్పాక్షికంగా విచారణ జరపాలని కుండబద్దలుకొట్టినట్లు సుప్రీంకోర్టు చెప్పింది. ఇవాళ ఘోష్ కమిషన్ 8బీ కింద మాకు నోటీసులు ఇవ్వలేదు. విచారణ నిస్పాక్షికంగా జరుపలేదు. అందుకే ఈ విచారణ అన్‌ఫేర్. రాజకీయ ప్రేరేపితమని చెప్పదలచుకున్నాను. 1989లో కిరణ్ బేడీ వర్సెస్ కమిటీ ఆఫ్ ఎంక్వైరీలో 8బీ కింద నోటీసులు ఇవ్వకుండా విచారణ చేస్తే.. ఆ రోజు సుప్రీంకోర్టు 'ఈ రిపోర్ట్ చెల్లదు. ఈ రిపోర్ట్ న్యాయబద్ధం కాదు. ఈ రిపోర్ట్ లెక్కకు రాదు' అని సుప్రీంకోర్టు కుండబద్దలు కొట్టింది' అని గుర్తు చేశారు.

**ఇందిరపై షా కమిషన్ ఏమైంది..?**

'ఎల్‌కే అద్వానీ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్.. ఎల్‌కే అద్వానీపై ఇలాంటి విచారణ కమిటీ వేస్తే.. 8బీ నోటీసులు ఇవ్వనందుకు 2003లో పాట్నా హైకోర్టులో కేసు వేస్తే.. 8బీ కింద విచారించలేదు.. ఇది తప్పు అన్నప్పుడు.. హైకోర్టు ఆ కేసును కొట్టివేసింది. అప్పుడు బిహార్ రాష్ట్రం సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్తే.. 8బీ కింద నోటీసులు ఇవ్వకపోతే విచారణ నివేదిక చెల్లదని సుప్రీంకోర్టు కూడా కేసును కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. తమిళనాడులో 1997లో జయలలిత వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో 8బీ కింద నోటీసు ఇవ్వకపోతే మద్రాస్ హైకోర్టు కూడా నివేదిక చెల్లదని.. చిత్తుకాగితంతో సమానమని.. రిపోర్ట్‌ని కొట్టివేసిందని గుర్తు చేస్తున్నాను. మీరు ఇగ ఇందిరమ్మ రాజ్యం అంటున్నరు కదా? ఇందిరమ్మపై వేసిన కమిషన్ కూడా ఉంది. ఆ నాడు ఇందిరా గాంధీ 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధిస్తే.. అప్పుడు అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం ఇందిరాపై షా కమిషన్ వేసింది. షా ఎవరూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. మా ఉత్తమ్ ఉంటున్నడు సుప్రీంకోర్టు న్యాయమూర్తి తీర్పునే తప్పు పడుతరా? సుప్రీంకోర్టు నివేదికను పీసీసీ రిపోర్ట్ అంటరా? అన్నరు. ఆ రోజు కాంగ్రెస్ నాయకులు దేశవ్యాప్తంగా ధర్నాలు చేశారు. షా కమిషన్ కక్షపూరితమైందని.. రాజకీయ ప్రేరేపితమైందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వ్యతిరేకంగా మీరు ధర్నాలు చేస్తే ఒప్పు.. ఈ చెత్త రిపోర్ట్‌ను తప్పు అంటే.. మాది తప్పు అవుతుందా? అని అడుగుతున్నా' అంటూ హరీశ్‌రావు నిలదీశారు.

# తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు..

సిద్దిపేట(పవర్ ), హైదరాబాద్ : తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద నిప్పులు చెరిగారు. అసెంబ్లీ సమావేశాలను పక్కనపెట్టి సీఎం కేరళ పర్యటనకు వెళ్లడం.. వారికి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఏ బిల్లులు పెడతారో స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్రంలో వరదలతో, యూరియా కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక మీద సాయంత్రం చర్చ ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాళేశ్వరం మీద చర్చ పెడతామంటున్నారు. ఖర్చుతో కూడుకున్న అసెంబ్లీ సమావేశాలను పట్టించుకోకుండా సీఎం కేరళకు వెళ్లారు. పుస్తక ఆవిష్కరణ కోసం ఫ్లైట్ బుక్ చేసుకొని మరి సీఎం కేరళకు వెళ్లారు అని కేపీ వివేకానంద మండిపడ్డారు. కేసీఆర్ వల్లే బీసీ రిజర్వేషన్ ఆగిపోయిందని నిందలు వేశారు. ఇప్పుడు కాళేశ్వరం మీద నిందలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. తూతూ మంత్రంగా సమావేశాలను నడుపుతున్నారు. హైకోర్టు మొట్టి కాయలు వేసిన తరువాతే కాళేశ్వరం కమిషన్ నివేదికను సభ్యులకు ఇచ్చారు. ఇరిగేషన్ మినిస్టర్ వారి మంత్రులకు ఎమ్మెల్యేలకు నిన్న ట్రైనింగ్ ఇచ్చి బీఆర్ఎస్‌ను ఎలా ఎదుర్కోవాలో ట్రైనింగ్ ఇచ్చారు. మాకు మాత్రం 665 పేజీల నివేదికను చూసే సమయం లేకుండా చేశారు. నిన్న రాత్రి వరకు ఎజెండా చెప్పకుండా డిలే చేశారని కేపీ వివేకానంద ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరద కారణంగా ఇబ్బంది పడుతున్నారు. రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో మేమంతా అసెంబ్లీకి వచ్చాము. ఇలాంటి సమయంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రక్కన పెట్టి కేరళ వెళ్ళాడు. ఢిల్లీలో హై కమాండ్‌కు భజన చేయడం, కుర్చీ కాపాడుకోవడం తప్పా రాష్ట్ర ప్రయోజనాలు అయనకు పట్టడం లేదు. ఏదో ఉదయం వచ్చి బీసీ బిల్లుపై మాట్లాడి.. స్పెషల్ ఫ్లైట్‌లో కేరళ వెళ్ళాడు. ఇప్పటికే తెలంగాణ అప్పుల పాలైందనీ.., ఒక్కో పైసా ఆదా చేస్తూ రాష్ట్రాని కాపాడుతున్నా అన్నాడు. కానీ ఇంత ఖర్చుతో అసెంబ్లీ జరుగుతుంటే అత్యంత ఖర్చు పెట్టి స్పెషల్ ఫ్లైట్‌లో ఎలా వెళ్ళాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో పీసీ ఘోష్ రిపోర్ట్‌పై చర్చ పెట్టారు. పీసీ ఘోష్ కమిషన్ కేవలం కాంగ్రెస్ కమిషన్ మాత్రమే. కాళేశ్వరం నీటిని వాడుకుంటూ.. కాళేశ్వరం విఫల ప్రయత్నం అని అంటున్నారు. కోర్టు ఆదేశించిన తర్వాతే.. కమిషన్ రిపోర్ట్ పెన్ డ్రైవ్‌లో ఇచ్చారు. 665 పేజీల రిపోర్ట్ పొద్దున ఇచ్చి.. మధ్యాహ్నం మాట్లాడాలన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క దుర్బుద్ధి. వాళ్ల మంత్రులకు, ఎమ్మెల్యేలకు ముందే పవర్ పాయింట్ ప్రెజెంటెషన్ ఇచ్చే ప్రిపేర్ చేశారు. ప్రజలు రాష్ట్రంలో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మమ్మల్ని ఇక్కడ కట్టిపడేశాడు. వాళ్ల సొంత పార్టీ ఎమ్మెల్యేనే ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఉందని సభకి రానాని చెప్పాడు. అధికారం ఉందని ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడు అని రేవంత్‌పై కేపీ ధ్వజమెత్తారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదు. అధికారం వస్తూ పోతూ ఉంటది. ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారు. ఇంకా కొన్ని రోజులు సభ నడపాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోవడం లేదు. యూరియాపై చర్చ చేద్దామంటే స్పందన లేదు. పవర్ పాయింట్ ప్రెజెంటెషన్‌కు అవకాశం అడిగితే ఇవ్వడం లేదు. సభ్యులందరూ పనులు పక్కన పెట్టి సభకు వస్తే.. ముఖ్యమంత్రి గాలికి తిరగడం సబబు కాదు.. ఇప్పటి నుండి ఎప్పుడూ సభ పెట్టాలంటే.. అప్పుడు సభ్యుల అభిప్రాయం తీసుకోవాలి. ఎంత ఆలస్యం అయినా కూడా మా సభ్యులు ఉండడానికి సిద్ధంగా ఉన్నాము. ప్రజలకి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాపై ఉందని కేపీ వివేకానంద గౌడ్ పేర్కొన్నారు.



## చాయ్ తాగే లోపు చేయొచ్చు కదా..?

సిద్దిపేట(పవర్ ), హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి చాలా సార్లు బయట మాట్లాడుతూ.. ఎంతసేపు చాయ్ తాగే లోపు అయిపోతాయని మాట్లాడుతుంటారు.. ఇంకో పది రోజులు చర్చ చేసినా ఇక్కడ తేలదు, తెగదు అని ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. రాహుల్, మోదీ చాయ్ తాగి ఇద్దరు డిసైడ్ చేసుకుంటే అర గంటలో బీసీ రిజర్వేషన్ల అంశం ఒడిసిపోతది, బిల్లు పాస్ అయిపోతది. రాజ్యాంగ సవరణ జరిగిపోతది. పది రోజులు హౌజ్ నడిపినా.. ఇది అయ్యేది కాదు అని కేటీఆర్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ సభలో మాట్లాడారు.

మార్చిలో బిల్లు పాస్ చేసిన దానికి, ఇప్పుడు తెస్తున్న బిల్లుకు తేడా ఏంది..? ఆర్డినెన్స్ మీద సంతకం చేయని గవర్నర్.. ఈ బిల్లుపై ఎలా సంతకం చేస్తారో ప్రభుత్వం చెప్పాలి. చట్టాల్లో లొసుగులు ఉంటేనే కోర్టుకు వెళ్తారు. కోర్టుకు వెళ్లొద్ద అనడం సరికాదు. ప్రభుత్వాలు చట్టాలకు తూట్లు పొడిస్తే, లోబడి పని చేయకపోతే జ్యుడిషియల్ రివ్యూ ఉంటది. ఆ విషయం మంత్రులు గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచించారు.

బీసీ ధర్నాకు మేం రాలేదు ఓకే. మరి రాహుల్, ఖర్గే ఎందుకు రాలేదు. ఇది డ్రామా అని వారు కూడా అనుకున్నారా..? డిక్లరేషన్లు కాదు డెడికేషన్ కావాలి. మీరు కన్ఫ్యూజ్ అయి అందర్నీ కన్ఫ్యూజ్ చేయొద్దు. ప్రజలను గందరగోళ పరచకండి. ప్రధాని అపాయింట్‌మెంట్ ఎమ్మెల్యే ఇప్పిస్తాడా..? ముఖ్యమంత్రి కార్యాలయం అపాయింట్‌మెంట్ అడగాలి. తప్పకుండా ఇస్తారు. సీఎం రేవంత్ రెడ్డి 20 నెలల కాలంలో 52 సార్లు ఢిల్లీకి పోయారు. ఈ సమస్య తేలాలి అంటే రెండు మార్గాలు ఉన్నాయి. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి.. మేం కూడా వస్తాం. ఇక రెండోది డెడికేషన్ ఉండాలి. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే బీసీ బిల్లు సాధించుడో.. ఢిల్లీ నుంచి తిరిగి రాను అని చెప్పి జంతర్ మంతర్‌లో ఆమరణ దీక్ష చేయమనండి.. మేం వద్దంటున్నామా..? అని కేటీఆర్ అన్నారు.




# ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేస్తున్నాం

- **కేరళలో వేణుగోపాల్ సేవలకు రేవంత్ రెడ్డి ఘన సత్కారం**
- **"విద్యే సమాజానికి శక్తివంతమైన ఆయుధం" – రేవంత్ రెడ్డి**
- **3,500 మందికి పైగా విద్యార్థులకు మెరిట్ అవార్డులు ప్రదానం**
- **కేరళ డ్రాప్ అవుట్ రేటు సున్నా.. తెలంగాణకు ఆదర్శమని సీఎం వ్యాఖ్య**

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :

కేరళలోని అలెప్పీ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఒక విశేషమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఘనంగా సత్కరించారు. ఆయన మాటల్లో, వేణుగోపాల్ గారు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, పేదల కోసం, అణగారిన వర్గాల కోసం ఎప్పటికప్పుడు పోరాడుతూ ప్రజలకు నిజమైన గొంతుకగా నిలుస్తున్న అసామాన్య వ్యక్తి. 2006లో ఆయన ప్రారంభించిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డులు సమాజంలో విద్యా ప్రోత్సాహానికి మార్గదర్శకంగా నిలిచాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ అవార్డుల ప్రాముఖ్యతను వివరించారు. "ఈ రోజు 150 పాఠశాలల నుండి 3,500 మందికి పైగా విద్యార్థులు ఈ అవార్డులు అందుకుంటున్నారు. విద్యార్థులను ప్రోత్సహించే ఈ కార్యక్రమం కేవలం కేరళలోనే కాకుండా దేశమంతటా ఆదర్శంగా నిలవాలి," అని ఆయన అన్నారు.




విద్య ప్రాధాన్యతపై మాట్లాడిన రేవంత్ రెడ్డి, "విద్య అనేది మనిషికి లభించే అత్యంత గొప్ప బహుమతి మాత్రమే కాదు, సమాజాన్ని ముందుకు నడిపించే శక్తివంతమైన ఆయుధం కూడా. సమాజంలో సమానత్వం తీసుకురావడానికి, పేదరికాన్ని దూరం చేయడానికి విద్యే ప్రధాన మార్గం," అని పేర్కొన్నారు. కేరళలో పదో, పన్నెండో తరగతుల తర్వాత విద్యార్థుల డ్రాప్ అవుట్స్ శాతం సున్నాగా ఉండటం దేశమంతటికి ఆదర్శమని ఆయన అభినందించారు. అలాగే, తెలంగాణలో కూడా విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. పాఠశాలల మౌలిక సదుపాయాల నుండి ఉన్నత విద్యా అవకాశాల వరకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని, భవిష్యత్తు భారత్‌కు బలం కావాల్సిన యువతను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. "యువతే రేపటి దేశ భవిష్యత్తు. వారికి సమాన అవకాశాలు కల్పించడంలో విద్యే ప్రధాన ఆధారం. ఈ దిశగా తెలంగాణలో ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నాం," అని రేవంత్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన విద్యా అవార్డులను ప్రస్తావించడం ద్వారా రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో విద్యపై ఉన్న కట్టుబాటు, కేరళ మోడల్ పట్ల ఉన్న గౌరవాన్ని మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం అక్కడి విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# సెప్టెంబర్ 10 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్

- **రెండు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధత**
- **బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లు అసెంబ్లీలో చర్చలో**
- **ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు**
- **హైకోర్టు ఆదేశాల మధ్య గ్రామీణాభివృద్ధి నిధుల కోసం కీలకమైన ఎన్నికలు**

సిద్దిపేట(పవర్), హైదరాబాద్ :



తెలంగాణలో చాలా కాలంగా వాయిదా పడుతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు చివరకు పచ్చజెండా ఊగబోతున్నట్లు కనిపిస్తోంది. వచ్చే వారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే దిశగా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తేల్చి చెప్పారు. సెప్టెంబర్ 10 తర్వాత ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

మంత్రి కోమటిరెడ్డి వివరాల ప్రకారం, స్థానిక సంస్థల ఎన్నికలు రెండు విడతల్లో జరిగే అవకాశముంది. తొలి దశలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత రెండో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు కావాల్సిన సన్నాహాలు ఎన్నికల సంఘం వేగవంతం చేసింది. ప్రస్తుతం అసెంబ్లీలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల బిల్లుపై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అసెంబ్లీలో ఆమోదం తర్వాత మండలిలో కూడా ఆ బిల్లుపై చర్చ జరగనుంది. ఆ తర్వాతే ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఈ రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి వారం రోజుల సమయం కోరింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ దిశగా అడుగులు వేస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 10లోపు విడుదల చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. సెప్టెంబర్ 4 లేదా 5న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం 6 లేదా 7న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై అభ్యంతరాలను స్వీకరిస్తారు. పరిశీలనల అనంతరం 8 లేదా 9న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. దీంతో సెప్టెంబర్ 10నాటికి ఎన్నికల ప్రక్రియ ఘనంగా ప్రారంభమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

గత ఏడాదిన్నరగా రాష్ట్రంలో పాలక మండళ్లు లేకపోవడంతో గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోయాయి. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయి. ఈ నిధులను తిరిగి పొందేందుకు కూడా ఎన్నికలు కీలకమని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తెలంగాణ హైకోర్టు కూడా సెప్టెంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ఎంఎన్ కే సెంట్రల్ కోర్టులో ఘనంగా గణేష్ వేడుకలు

**సికింద్రాబాద్, ఆగస్టు 31( సిద్దిపేట పవర్ ):**


సికింద్రాబాద్ న్యూ బోయిగూడ ఎంఎన్ కే విట్టల్ సెంట్రల్ కోర్టు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ జి. హనుమాన్లు, ఉపాధ్యక్షులు వి. ఉమాశంకర్, ట్రెజరర్ కె. సేతుమాధవ రావు, సంయుక్త కార్యదర్శి వి. శ్రీనివాసన్, కార్యవర్గ సభ్యులు వి. సుధీరు బాబు, రెసిడెంట్స్ రమణ, కాళిదాసు, నాగరాజు, పద్మాకరం, శ్రీదేవి, ప్రమీల, శేషకుమారి, రేఖ తదితరులు ఉత్సవాలలో పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా మహిళలు, పిల్లలకు వివిధ ఆటలు, కల్చరల్ పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులను అందజేశారు. గణేశుడి చేతిలో పూజలందుకున్న లడ్డూను వేలం వేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమానికి అపార్టుమెంటులోని ప్రతిఒక్కరూ హాజరయ్యారు. ఈసారి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చవితి వేడుకలు నిర్వహించడం విశేషం.



# దారిలో పడిపోయిన పాస్ పోర్టు దొరికితే ఇవ్వండి ప్లీజ్

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 31 ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పన్నపల్లి గ్రామానికి చెందిన పర్స రవీందర్ రెడ్డి /ఐలరెడ్డి కి చెందిన పాస్పోర్టు మిస్సైంది. రవీందర్ రెడ్డి ఈనెల 25న తన గ్రామం నుంచి దుబ్బాక కు బైక్ పై వెళ్తుండగా దారిలో పడిపోయింది. దుబ్బాక మీసేవ కేంద్రానికి వెళ్లి బైక్ కవర్ లో చూడగా పాస్పోర్టు ( W 1541110 ). కనిపించలేదు. తిరిగి వెనక్కి వెళ్లి దారి వెంట వెతికినప్పటికీ తన పాస్పోర్ట్ దొరకలేదని ఆయన వాపోయారు. ఎవరికైనా ఈ ప్రాంత ప్రజలకు తన పాస్పోర్టు దొరికినట్లైతే దయచేసి తన 9492398399 ఈ నెంబర్ కు ఫోన్ చేయాలని రవీందర్ రెడ్డి కోరారు.




# చుంచనకోట అడవుల్లో చిరుత లేదా పెద్ద నక్క తిరుగుతుంది

**చేర్యాల, ఆగస్టు 31 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం చుంచనకోట అడవుల్లో చిరుత లేదా పెద్ద నక్క తిరుగుతుంది అని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాయుడు తెలిపారు..ఈ సందర్భంగా రాయుడు మాట్లాడుతూ రైతులు అందరూ పశువులను ఇంటి వద్దనే కట్టి వేయాలని, వ్యవసాయ పనులకు అందరూ గుంపులు గా వెళ్ళాలని సాయంత్రం 6 తరువాత ఎవరు కూడా వ్యవసాయ బావుల వద్ద ఉండరాదు అని తెలిపారు..చుంచనకోట పరిధిలో ఆ జంతువు కాలి ముద్రలు గుర్తించామని, ఒక చిన్న లేగ దూడను ఆ జంతువు గాయపరిచింది అని తెలిపారు..చుంచనకోట, పోతిరెడ్డి పల్లి, కడవేర్గు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని రాయుడు సూచించారు..



## పెద్ద గుండవెల్లి శ్రీ రేణుకా మాత ఆలయాన్ని దర్శించుకున్న లచ్చపేట మాజీ ఎంపీటీసీ ఇంగు శోభ శివకుమార్(సీనియరజర్నలిస్ట్)

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 31 ప్రతినిధి**



సిద్ది పేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో ఉన్న శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీటీసీ ఇంగు శోభ శివకుమార్ దంపతులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో మహిమలు ఉన్న అమ్మవారుగా దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని ఎంపీటీసీ దంపతులు తెలిపారు. అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుందని వచ్చే భక్తులు కూడా అమ్మవారిని కొలుచుకుని తమ కోరికలను తీర్చుకోవాలని ఎంపిటిసి దంపతులు తెలిపారు . అమ్మవారిని ఇంగువ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి, అమ్మవారి చిత్రపటాన్ని బహుమానంగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ క్యాషియర్ కోంద్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యత కలిగిన ప్రతి యువకుడు రక్తదానం చేయాలి

**చేర్యాల, ఆగస్టు 31(సిద్దిపేట పవర్)**



రోడ్డు ప్రమాదాలతో పాటు అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేకపోతే ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని, బాధ్యత కలిగిన ప్రతి యువకుడు రక్తదానం చేయాలని సామాజిక సేవకులు ప్రముఖ పత్రికా జర్నలిస్ట్ గణేష్ తివారి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ పేషెంట్ కు బ్లడ్ అవసరం ఉండగా వివేకానంద టీచర్ అసోసియేషన్ ఫౌండర్ నరిగే బాలభాస్కర్ గణేష్ తివారికి ఫోన్ ద్వారా సమాచారం అందివ్వగా వెంటనే స్పందించిన గణేష్ చేర్యాల నుంచి సిద్దిపేటకు వెళ్లి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా గణేష్ తివారి మాట్లాడుతూ.తమ జన్మదినం సందర్భంగా రక్తదానం చేసి ఒకరి ప్రాణాన్ని కాపాడడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం అంటే సమాజానికి సేవ చేసినట్లే అవుతుందని తెలిపారు. జర్నలిస్టులు నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేయడమే కాకుండా మరోవైపు ఇలాంటి సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నడం అభినందనీయన్నారు. ఇటీవల ప్రమాదాలు పెరుగుతున్న క్రమంలో రక్త నిల్వలు చాలా అవసరం అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ తివారిని, వీటి ఫౌండర్ నరిగే బాలభాస్కర్, రాంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణు తో పాటు వర్తక వాణిజ్య సంఘాల నాయకులు, పలువురు ప్రజలు అభినందించారు.

# గణేష్ మండపం వద్ద సరస్వతి పూజ

**చిన్నారులకు బుక్స్ పెన్నులు పంపిణీ**
**వీర్ సవర్కర్ ఆధ్వర్యంలో నేడే అన్నదానం**
**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు:31 ప్రతినిధి**

వినాయక నవరాత్రి ఉత్సవంలో భాగంగా వీర్ సవర్కర్ గణేష్ మండపం వారు వినూత్న రీతిలో గణపతి వద్ద చిన్నారులచే సరస్వతి దేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం రోజున ఉదయం 150 విద్యార్థిని విద్యార్థులచే సరస్వతి పూజ నిర్వహించి వీరు సవర్కర్ గణేష్ మండపం అధ్యక్షులు చింత మణికంఠ గుప్తా చిన్నారులకు పలక ,బలపం , పుస్తకం , పెన్నులు , పూజ సామాన్లు పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా చిన్నారులచే సరస్వతి దేవి పూజ చేయించి వారికి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది అన్నారు. అంతేకాకుండా నేడు అనగా 01092025 సోమవారం రోజున ఉదయం 10 గంటలకు లక్ష దర్బార్లతో కుంకుమార్చన, లక్ష్మీ గణపతి హోమం మధ్యాహ్నం 12 45 నిమిషాలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమానికి మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



# వారసిగూడా లో అటెన్షన్ డైవర్షన్ నిందితుడి అరెస్ట్

**సికింద్రాబాద్, ఆగస్ట్ 31 ( సిద్దిపేట పవర్):**

ఈస్ట్ జోన్ పరిధిలోని వారసిగూడా పోలీసులు ఆటెన్షన్ డైవర్షన్ నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు పెద్ద బుచర్ కత్తులు, ఒక నీలిరంగు చొక్కా, ఒక వైర్లెస్ సెట్, ఒక వీవో మొబైల్, రూ.4,300 నగదు, బైక్ ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాలు.. ఎల్ఎన్ నగర్ కు చెందిన మటన్ షాప్ వర్కర్ గౌస్ ఖాన్ అలియాస్ ఆఫ్తాబ్ ఖాన్ (33) ఆగస్ట్ 26న సాయంత్రం మాస్క్, హెల్మెట్ ధరించి చేతిలో వైర్లెస్ తో జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారిగా నటిస్తూ రాంనగర్ లోని వైఎస్ఆర్ పార్కు సమీపంలోని ఓ మటన్ షాప్ లోకి వెళ్ళాడు. అక్కడ కార్మికుడిని బెదిరించి రెండు బుచర్ కత్తులు, రూ 4,300 నగదును దొంగిలించాడు. బాధితుడు ముషీరాబాద్ కు చెందిన బాధితుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు వారాసిగూడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో కమ్యూనిటీ సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఆగస్ట్ 31న వారాసిగూడ ఎక్స్ రోడ్డు వద్ద నిందితుడిని పట్టుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్ రెడ్డి పర్యవేక్షణలో వారాసిగూడ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ పురేందర్ రెడ్డి, ఎస్ఐలు గోపాల్, సుధాకర్,సిబ్బంది కేసును చేధించారు. వీరిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



# 5 వ రోజు దుబ్బాకలో కత్తి కార్తిక గౌడ్ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 31 ప్రతినిధి**

కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్వామివారి పూజా కార్యక్రమాలు శ్రద్ధా భక్తులతో జరిపిన అనంతరం, చిన్న పిల్లల కోసం ఆటపాటల పోటీలు నిర్వహించబడినవి. పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు.అనంతరం బాణాసంచా కాల్చి ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

ఈ ఉత్సవాలు స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించాయి. కత్తి కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అనేక కార్యక్రమాలు చేస్తూ ప్రతిరోజు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసి గణనాథుని ప్రత్యేక పూజలు చేసి ఎల్లప్పుడు పాడిపంట చల్లగా ఉండాలని తొమ్మిది రోజులు గణనాథునికి పూజలు చేసి తొమ్మిదో రోజున గంగమ్మ ఒడిలో గణనాథుని ఘనంగా పూజలు చేసి చిన్న పెద్ద తేడా లేకుండా గణనాథుని . మరియు దుర్గ మాత భక్తి శ్రద్ధలతో పూజించి అమ్మవారిని ప్రతి సంవత్సరం అంగరంగ ఈ కార్యక్రమం నిర్వహించి ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి కోసం నేనున్న అంటూ ముందుకు వస్తున్న కత్తి కార్తిక ఆపద వస్తే కదిలే కత్తి కార్తీక గుర్తుకొస్తుందని ప్రజలు తెలిపారు





# ప్రెస్ క్లబ్ లో అన్నదాన కార్యక్రమం..

**పాల్గొన్న పలువురు జర్నలిస్టులు**
**సిద్దిపేట ఆగస్టు 31 :**

సిద్దిపేట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రెస్ క్లబ్ లో అన్నదాన కార్యక్రమం జరిగింది. ముందుగా జరిగిన పూజా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ క్లబ్ ఇంచార్జి చిటుకుల మైసారెడ్డి లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి, సంఘం నాయకులు నాయిని సంజీవరెడ్డి, ఆకుల పాండు, బబ్బూరి రాజు, పాతర్ల వెంకటేశ్వర్లు, రంగధాం పల్లి శ్రీనివాస్ గౌడ్, ఐత శ్రీనివాస్, జర్నలిస్టులు పోతరాజు రమేష్, వెంకన్న, ఇంద్ర సేనా రెడ్డి, ఎం. శ్రీకాంత్, ఇంద్ర శేఖర్ , క్రైం శ్రీనివాస్, రాజబాబు, సాయి చరణ్ గౌడ్, భాస్కర్, కాసర్ల మురళీ, శ్రీనాథ్, శ్రీకాంత్, చందు, సంతోష్, చిన్న నరేష్, గిరి, ఎల్లోహర్, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వక్రతుండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహణ

**నంగునూరు ఆగస్టు 31 ( సిద్దిపేట పవర్ )**

నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో వక్రతుండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు ప్రతి సంవత్సరం గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరుగుతుంది అందులో భాగంగా ఆదివారం రోజు అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు

సహకరించిన దాతలు కొమ్మూరి లక్ష్మారెడ్డి, మ్యడ శ్రీనివాస్ రెడ్డి, చల్లారం రాజు రెడ్డి, చింతకుంట ప్రకాష్ రెడ్డి, కొమ్మూరి వెంకట్ రెడ్డి, కొమ్మూరి శ్రీనివాస్ రెడ్డి, చల్లారం రవీందర్ రెడ్డి, కొమ్మూరి మహేందర్ రెడ్డి , మహమ్మద్ అంజద్ ఖాన్ , నార్లపురం శేఖర్, నార్లపురం భాను సహాయంతో కమిటీ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# దశాబ్దాలుగా గణేశుడి సేవలో రెడ్ హిల్స్ శివాజీ యూత్

**ఆకట్టుకుంటున్న 18 సీట్ల మహాగణపతి**
**సికింద్రాబాద్, ఆగస్ట్ 31 ( సిద్దిపేట పవర్):**



హైదరాబాద్ నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని రెడ్ హిల్స్ లోని శివాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు గత కొన్ని దశాబ్దాల కాలం నుంచి గణేశ్ మహరాజ్ సేవలో తరిస్తున్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్థానిక యువకులు భక్తి ప్రవత్తులతో గణేశుడి ప్రతిమను పెట్టి నవరాత్రోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గణేశుడి మండపం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను,అన్నదానాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 18 ఫీట్ల మహా గణపతి ప్రతిమను నెలకొల్పినట్లు ఆర్గనైజర్లు తెలిపారు. ఆదివారం జరిగిన పూజ కార్యక్రమాల్లో శివాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు చంద్రశేఖర్,భరత్ ముదిరాజ్ , రోహిత్ చవన్ ప్రణయ్ ముదిరాజ్ ,శివకుమార్,ఉమేశ్ కోయల్కర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.దశాబ్దాల తరబడిగా విజయవంతంగా రెడ్ హిల్స్ ప్రాంతంలో వినాయకుడి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్న శివాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులను స్థానికులు అభినందిస్తున్నారు.

# సంచార జాతులు, నిరాశ్రయులకు దుస్తులు, ఔషధాలు పంపిణి



**సికింద్రాబాద్, ఆగస్ట్ 31 ( సిద్దిపేట పవర్ ) :**

హైదరాబాద్ మహా నగరంలో రోడ్ల పక్కన పుటపాతులే ఆవాసంగా జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, నిరుపేదలు, సంచార జాతుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని స్కై ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. వారికి శాశ్వత ఆవాసంతో పాటు ఉపాధిని కల్పించి, నూతన జీవితాన్ని ప్రసాదించాలన్నారు. ఆదివారం సిటీలోని పలు ప్రధాన రహదారుల ఫుట్ పాత్ లపై ఉన్న నిరాశ్రయులకు దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణి చేశారు. మారిన వాతావరణంతో సీజనల్ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఔషధాలను ఇచ్చారు. ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు ప్రధమ చికిత్సను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్. వై. సంజీవ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని, సేవ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్హైచ్ఆర్సీ సీరియస్

**దుర్మరణం పాలైన కూలీల నష్టపరిహారంపై నోటీసులు**
**సికింద్రాబాద్, ఆగస్ట్ 31 ( సిద్దిపేట పవర్):**

తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే రామ కృష్ణా రావు ఐ ఏ ఎస్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి ఐ పి ఎస్, నాగారం మునిసిపాలిటీ కమిషనర్ భాస్కర్ రెడ్డి పై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. గతంలో కె పి హెచ్ బి పరిధిలో అక్రమ నిర్మాణం ఆరో అంతస్తు కూలి దుర్మరణం చెందిన బలరాం బద్నాయక్ , సోనియా బద్నాయక్, బుద్ధా బద్నాయక్ అనబడే ఒరిస్సా కు చెందిన వలస కూలీలు వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ లో గతంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామా రావు ఇమ్మానేని పిటిషన్ ను జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికలు సంతృప్తికరంగా లేవంటూ 30.08.2025 నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే రామ కృష్ణా రావు ఐ ఏ ఎస్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి ఐ పి ఎస్ లను కేసు దర్యాప్తు విషయంలో రోజువారీ పురోగతి, నివేదిక ఇవ్వాలని ఎన్హైచ్ఆర్సీ ఆదేశించింది. మృతుల కుటుంబాలకు పరిహారానికి సంభందించిన విషయాలను పొందుపరిచి నాలుగు వారాలలోగా నివేదిక సమర్పించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

# జామాకుతో ఇన్ని ప్రయోజనాలా!





జామ పండ్లు... గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో విరివిగా లభించే ఈ పండ్లంటే అందరికీ ఇష్టమే... అయితే జామ పండ్లను ఇష్టంగా తినే వాళ్లు ఆకులను మాత్రం ఎవరూ పట్టించుకోరు.. అదేంటి ఆకులను ఎవరైనా తింటారా? అని నవ్వుకోకండి. ఈ జామ ఆకుల్లో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. మరెన్నో ఔషధ గుణాలున్నాయి, జామ ఆకులు అనేక వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తారు. వైద్యం లక్షణాలను బట్టి సాంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. జామ ఆకుల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణక్రియకు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మాన్ని మెరుగుపరచడానికి, జుట్టు పెరుగుదలకు కూడా సహాయపడతాయి. మరి ఇలాంటి ఎన్నో ఆరోగ్య రహస్యాలను దాచుకున్న జామ ఆకుల గురించి తెలుసుకోండి....

విటమిన్లు: జామ ఆకుల్లో విటమిన్లు సి, ఎ ఉన్నాయి. విటమిన్ సి వ్యాధులతో పోరాడటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ ఎ కళ్లు, చర్మాన్ని రక్షిస్తుంది.

ఖనిజాలు: ఈ ఆకులు పొటాషియం వంటి అవసరమైన ఖనిజాలను అందిస్తాయి. పొటాషియం గుండెకు మంచిది. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

యాంటీఆక్సిడెంట్లు: జామ ఆకులు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ అని పిలిచే హానికరమైన పదార్థాల నుంచి రక్షిస్తాయి.



## జామ ఆకుల పది ఆరోగ్య ప్రయోజనాలు

**1. జీర్ణ ఆరోగ్యం:**
జామ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్నాయి, ఇవి పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటి అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియకు సహాయపడుతుంది, మలాన్ని మృదువుగా చేసి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన జీర్ణవ్యవస్థను పెంపొందిస్తుంది.

**2. బ్లడ్ షుగర్ లెవెల్:**
షుగర్ వ్యాధి ఉన్నవారికి లేదా ముప్పు ఉన్న వారికి జామ ఆకులు మంచివి. ఇది గ్లూకోజ్ స్థాయిలను స్థిరీకరిస్తుంది. భోజనం తర్వాత రక్తంలో చక్కెరలో పెద్ద స్పైక్‌లను నివారిస్తుంది.

**3. రోగ నిరోధక వ్యవస్థ మెరుగు:**
జామ ఆకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. శరీరం రక్షణ విధానాలను పెంచడం ద్వారా, అవి వ్యాధులు, ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి, ఆరోగ్యంగా ఉంచుతాయి.

**4. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది:**
జామ ఆకులలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్‌స్‌ను తటస్థీకరిస్తాయి. ఇది క్యాన్సర్‌కు దారితీసే కణాల నష్టం మరియు ఉత్పరివర్తనాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రెగ్యులర్ వినియోగం కొన్ని రకాల క్యాన్సర్ల నుండి రక్షణను అందిస్తుంది.

**5. గుండెను పదిలం:**
జామ ఆకులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను మెరుగుపరిచి గుండె ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

**6. కంటి చూపుకు మంచిది:**
జామ ఆకులలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది, ఇది మంచి కంటి చూపుకు అవసరం. ఈ ఆకులను తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దృష్టిని పదునుగా చేస్తుంది. కంటి సంబంధిత సమస్యల నుంచి రక్షిస్తుంది.


**7. యాంటీ స్ట్రెస్ ఏజెంట్:**
జామ ఆకులు ఒత్తిడిని తగ్గించే గుణాలను కలిగి ఉంటాయి. ఇవి ఆందోళనను తగ్గించడంలో, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో సహాయపడతాయి. ఒత్తిడితో కూడిన సమయాల్లో ప్రశాంతంగా, రిలాక్స్‌గా ఉండటానికి అవి సహాయపడతాయి.

**8. బరువు తగ్గుతారు:**
జామ ఆకులు జీవక్రియను పెంచుతాయి, బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.ఇవి కేలరీలను సమర్థవంతంగా బర్న్ చేస్తాయి. బరువు తగ్గించే ప్రయత్నాలకు అదనపు ప్రయోజనకంగా ఉంటాయి.

**9. ఋతుస్రావం నొప్పి తగ్గిస్తాయి**
జామ ఆకులు ఋతు స్రావం నొప్పిని, అసౌకర్యానికి ఉపశమనం కలిగిస్తాయి. మహిళలకు తిమ్మిరిని తగ్గించగలవు. పీరియడ్స్ సక్రమంగా వచ్చేలా ఉపయోగపడతాయి.

**10. జుట్టు, చర్మానికి మేలు:**
జామ ఆకులలో యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి మొటిమలను తగ్గేంచేందుకు సహాయపడతాయి. అలాగే చర్మాన్ని బిగుతుగా ఉంచడం ద్వారా, ముడతల రూపాన్ని తగ్గించేందుకు పని చేస్తాయి. ఈ ఆకులు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి, అలాగే జుట్టు ఆరోగ్యాన్ని రక్షిస్తాయి.

జామ ఆకులు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్నా... అలెర్జీలు ఉన్న వారు, చర్మం సున్నితంగా ఉన్న వారు, ఏవైనా మందులు వాడుతున్న వారు వీటిని వాడటంలో తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి.



# 'డీప్ ఫ్రై'లతో డేంజర్!

రోజూవారీ ఆహారంలో భాగంగా చాలా ఇళ్లల్లో ఫ్రైలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. పప్పులు.. కూరలు.. మాంసాలు మామూలుగా వండుకు తింటే బాగానే ఉంటుంది. కానీ మరగకాగిన నూనెల్లో వేయించుకు తింటే అది ఎంతమాత్రం మంచిది కాదని వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి లంచ్‌లో అయినా డిన్నర్‌లో అయినా కర్రీతో పాటు పక్కన ఫ్రై ఐటెమ్స్ ఉండాల్సిందే. కమ్మగా కరకరలాడుతూ.. కాస్త కారంకారంగా ఉండే ఫ్రైలు ఎవరికైనా నచ్చేస్తాయి.అలాగే ఈ ఫ్రైలను ఫాస్ట్ గా వండేయొచ్చు. పెద్ద ఖర్చూ అవ్వదు. పైగా అంతా ఇష్టంగా తింటారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఈ ఫ్రైడ్ ఐటెమ్స్ దే హవా! అలూ చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్.. ఫ్రైడ్ ఫిష్.. చికెన్ స్ట్రిప్స్.. చీజ్ స్టిక్స్.. రుచి విషయంలో వీటి గురించి మరో ఆలోచనే అక్కర్లేదు. కానీ బాగా మరగకాగిన నూనెలో ముంచి తీసే వాటితో ఎన్నో నష్టాలున్నాయ్...



### క్యాలరీల టెన్షన్...

ఫ్రై చేసిన వంటకాల నుంచి వచ్చే క్యాలరీలు చాలా ఎక్కువ. ఎందుకంటే ముక్కలను వేడివేడి నూనెలో ముంచి తీసినప్పుడు వాటిలో ఉండే నీరంతా ఆవిరైపోతుంది, ఇదే సమయంలో అవి నూనెను బాగా పీల్చుకుంటాయి. నూనె వంటి కొవ్వుల నుంచి మనకు అందే క్యాలరీలు చాలా చాలా ఎక్కువ. అందుకే ఉడికించటం, నిప్పుల మీద కాల్చటం వంటి పద్ధతుల్లో వండిన వాటికంటే నూనెలో ఫ్రై చేసిన వాటి నుంచి మనకు ఎక్కువ క్యాలరీలు అందుతాయి.

చిన్న ఉదాహరణ చూద్దాం. 100 గ్రాముల ఆలూ ముక్కలను ఉడికించామనుకోండి... దాన్నుంచి మనకు దాదాపు 93 క్యాలరీల శక్తి అందుతుంది, కొవ్వు పెద్దగా ఉండదు. అదే ఆలూ ముక్కలను వేడివేడి నూనెలో వేసి బాగా కరకరలాడేలా వేయించామనుకోండి.. వాటి నుంచి దాదాపుగా 17 గ్రాముల కొవ్వు, 319 క్యాలరీల శక్తి అందుతాయి. అలాగే 100 గ్రాముల చేప ముక్కలను ఉడికిస్తే వాటి నుంచి 105 క్యాలరీల శక్తి, 1 గ్రాము కొవ్వు మాత్రమే అందుతాయి. అదే చేప ముక్కలను నూనెలో వేయిస్తే 232 క్యాలరీల శక్తి, 12 గ్రాముల వరకూ కొవ్వు అందుతాయి. కాబట్టి మనం వండే పద్ధతి వల్ల కొవ్వు, క్యాలరీలు పెరిగిపోతాయని, తరచూ ఫ్రైలను తింటుంటే దీని వల్ల ఊబకాయం, మధుమేహం వంటి చాలా రకాల సమస్యలు పొంచి ఉంటాయని గుర్తించాలి.

### రోగాలనూ రుచి చూడాల్సిందే!

గుండె జబ్బులు: ఫ్రైడ్ ఐటెమ్స్ ని ఎంత ఎక్కువ తింటుంటే గుండె జబ్బుల ముప్పు అంత ఎక్కువగా పెరుగుతోందని ఇటీవలి కాలంలో జరిగిన రెండు అతి పెద్ద అధ్యయనాల్లో గుర్తించారు. తరచూ వేపుళ్లు తింటున్న వారిలో హైబీపీ సమస్య ఎక్కువగా ఉంటోంది, మరోవైపు మంచి కొలెస్ట్రాల్ స్థాయులు ఉండాల్సినంత ఉండటం లేదు. ఈ రెండూ గుండె జబ్బుల ముప్పును పెంచుతున్నాయి.

మధుమేహం: ఫ్రైడ్ ఐటెమ్స్ వారానికి ఒకసారి తింటున్న వారితో పోలిస్తే.. వారానికి 46 సార్లు తింటున్న వారిలో మధుమేహం వచ్చే ముప్పు 39% అధికంగా ఉంటోంది. వాటిలో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్ తరహా కొవ్వుల వల్ల బరువు పెరగటంతో పాటు ఆకలిని నియంత్రించే హార్మోన్లు కూడా అస్తవ్యస్తమైపోతున్నాయని, ఇది మధుమేహం, ఊబకాయాలకు దారి తీస్తోందని గుర్తించారు.

క్యాన్సర్లు: వండేప్పుడు ఆహార పదార్థాలను అత్యధిక ఉష్ణోగ్రతల వద్దకు తీసుకెళ్తే అందులో 'ఆక్రిలమైడ్' అనే విషతుల్యమైనది తయారవుతుంది. పొగలొస్తున్న నూనెల్లో వేయించటం, మండే నిప్పుల మీద కాల్చటం, మాడ్చటం వంటి వాటి వల్ల ఈ రసాయనిక చర్య జరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా ఆలుగడ్డల వంటి వాటిలో ఉండే పిండిపదార్థాలు, చక్కెరలు, ఆస్పరాజిన్ అనే అమైనో ఆమ్లం ఇలాంటి వాటన్నింటి మధ్యా రసాయన చర్యలు జరిగి 'ఆక్రిలమైడ్' తయారవుతోంది. ఇది చాలా రకాల క్యాన్సర్లకు కారణమవుతోందని జంతువులపై జరిగిన పలు అధ్యయనాల్లో తేలింది.

### నూనెను మళ్లీ మళ్లీ వేడి చేస్తున్నారా?

వంట నూనెలను మరగకాచినప్పుడు అధిక ఉష్ణోగ్రతల వద్ద దానిలో రసాయనిక స్వభావం మారిపోయి అవి 'ట్రాన్స్ ఫ్యాట్స్' రకం కొవ్వులుగా మారిపోతాయి. ఈ తరహా కొవ్వులను మన శరీరం తేలికగా అరిగించుకోలేదు. ఫలితంగా గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి చాలా రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. బయట ప్యాకెట్లలో దొరికే ఫ్రైడ్ ఐటెమ్స్ తో కూడా ఈ సమస్య తప్పదు. వంట నూనెను మన ఇళ్లలో, హోటళ్లలో కూడా ఒక్కసారి వాడి వదిలేయరు. అవసరమైనప్పుడల్లా మరగకాచి వండుతుంటారు, మళ్లీ దాచుకుంటారు. ఇలా ఒకసారి కాచిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేయడం వల్ల వాటిలోని ప్రమాదకర ట్రాన్స్ ఫ్యాట్స్ స్థాయు మరింత పెరిగిపోతుందని పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు. ఫ్రైలు చేయాలంటే నూనెను విపరీతంగా వేడి చేయ తప్పదు, ఆ నూనెతో అనారోగ్య తప్పవు.

### ఇలా చేస్తే బెటర్..

ఫ్రైడ్ ఐటెమ్స్ తరచూ తినకుండా ఉండటం మంచిది. వీటిని ఎప్పుడైనా ఓసారి తింటే అంత ప్రమాదం ఏం ఉండదు. ఫాస్ట్ గా అయిపోతాయని, టేస్టీగా ఉంటాయని... ప్రతి కూరగాయని, మాంసాన్ని, దుంపలను నూనెలో ఫ్రై చేయకుండా ఇతర పద్ధతులపై దృష్టి పెట్టాలి. ఉడికించి వండుకోవడం, మామూలు కూరలుగా చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక ఫ్రైలు తినకుండా ఉండలేమంటే ఓవెన్‌లోనో, ఎయిర్ ఫ్రైయర్లలోనో చేసుకుంటే నూనెలో ముంచి తియ్యాల్సిన పని లేకుండానే ముక్కలు కరకరలాడుతూ టేస్టీగా ఉంటాయి.